క్లుప్తంగా

నేడు అంబేడ్కర్ జయంతి

దేవరాపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం మండలాధ్యక్షుడు కాటపల్లి అప్పారావు కోరారు. ఈ మేరకు ఆదివారం దేవరాపల్లిలో గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలు

మాడుగుల రూరల్: కె.జె.పురం తాచేరు సమీపంలో పెంటచేరి ప్రాంతంలో స్వయంభూ గంగాలమ్మతల్లి తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి ధూప దీప నైవేద్యంతో పూజలు, ఘటాలు ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు, పురుషుల పరుగు పోటీలు, మండల స్థాయి ముగ్గులు పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఉంటుందన్నారు.

నేడు ఆర్లిలో మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట



ఆర్లిలో నూతనంగా నిర్మించిన మరిడిమాంబ ఆలయం

కె.కోటపాడు: మండలంలో ఆర్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మరిడిమాంబ ఆలయాన్ని సోమవారం ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం జలోద్ధరణం, క్షీరాధివాసం, హోమాలు, ధాన్యాధివాసం మొదలగు పూజా కార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపారు. సోమవారం ఉదయం శిఖర ప్రతిష్ట, దర్పణ దర్శనం అనంతరం అమ్మవారి దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించనున్నట్లు వేదపండితులు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

సత్యసాయి సేవా సంస్థల జోన్ ఇన్‌చార్జిగా రవిశంకర్



రవిశంకర్‌ను అభినందిస్తున్న జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు

దేవరాపల్లి: అనకాపల్లి జిల్లా సత్యసాయి సేవా సంస్థల జోన్ ఇన్‌చార్జిగా సిహెచ్.వి. రవిశంకర్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కోరెడ్డి అప్పలనాయుడు ఆదివారం తెలిపారు. జోన్‌లోని దేవరాపల్లి, కె.కోటపాడు, చీడికాడ, సబ్బవరం మండలాల్లోని సత్య సేవా సంస్థల్లో విస్తృత సేవలు అందించాలని రవి శంకర్‌కు సూచించారు. ఈ బాధ్యతలను భక్తిశ్రద్ధలతో బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జోనల్ ఇన్‌చార్జి రవిశంకర్ స్పష్టం చేశారు.

ఘనంగా ప్రారంభమైన శ్రీరామరక్ష రథయాత్ర



ఉమ్మలాడలో శ్రీరామరక్ష రథయాత్ర ప్రారంభిస్తున్న భక్తులు

మునగపాక: మునగపాక మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామరక్ష రథయాత్ర ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. అయోధ్య రామాలయంలో బాలరాముడిని ప్రతిష్ఠించి ఏడాది కావచ్చిన సందర్భంగా ఉమ్మలాడ, నాగులాపల్లి, ఒంపోలు, గంగాదేవిపేట, మునగపాక గ్రామాల్లో రథయాత్ర నిర్వహించారు. ఈ యాత్రను పొందూరు ఆనందాశ్రయ స్వామీజీ శ్రీనివాసానంద సరస్వతి, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసానంద సరస్వతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవాటు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య

మునగపాక: ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య అందుతుందని ఎంఈవో బుద్ద శివనాయుడు తెలిపారు. మండలంలోని అరబుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు పని చేస్తుంటారన్నారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో పిల్లలను ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

- సమస్యలు పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ హయాంలో నిధులు మంజూరు
- నత్తనడకన కొనసాగుతున్న రోడ్డు పనులు
- మైదాన, గిరిజన ప్రాంతాలకు తప్పని ఇక్కట్లు



పెద గరువు నుంచి రోగిని వైద్యం కోసం డోలిమోతతో దిగువకు తరలిస్తున్న కుటుంబీకులు



లోసింగిలో ఒక ఇంటి వద్ద విద్యార్థులతో తల్లిదండ్రులు, వలంటీర్లు

గిరిజన గోడు వినేవారేరి!

రోలుగుంట: మైదాన గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోవడం లేదు. కనీసం చదువుకోవడానికి బడి లేదు. వైద్యం పొందాలంటే రవాణా సదుపాయం లేకపోగా, ఇప్పటికీ డోలిమోతలే శరణ్యమయ్యాయి. తాగునీటికి ఇక్కట్లు తప్పడం లేదు. ఇలా పలు సమస్యలతో సతమతమవుతున్నారు. మోసపూరిత వాగ్దానాలతో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే వదిలేసింది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరైన నిధులతో చేపట్టిన రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్న తీరు చూస్తుంటే గిరిజనుల పట్ల ఎంత చిన్న చూపు చూస్తుందో అర్థమవుతోంది.

మండలంలో ఆరు గిరిజన పంచాయతీ పరిధిలో 20 శివారు గ్రామాలున్నాయి. ఈ గ్రామాలకు కనీసం చిన్నారులు చదువుకోవడానికి పాఠశాలలు గానీ, అంగన్‌వాడీ కేంద్రాలుగానీ అవసరమైన మేర లేవు. దాంతో చినలోసింగి, పేదలోసింగి, పీత్రుగెడ్డ తదితర గిరిజన గ్రామాలకు చెందిన చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక బడి మానేస్తున్నారు. ప్రభుత్వ తీరు వల్ల తమ పిల్లలు విద్యకు దూరమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాల ప్రజలు పలు దఫాలు ప్రజాప్రతినిధులకు, అధికారులకు తమ సమస్యలపై పలు దఫాలు వినతులు అందజేసినా ఫలితం శూన్యమని వాపోతున్నారు. పెదలోసింగి, చినలోసింగి, పెద గరువు తదితర గ్రామాల్లో 40 మంది ఈడు పిల్లలు ఉన్నా పాఠశాలలు లేవు. ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య వెంటాడుతోంది. ఇక వేసవిలో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. గుక్కెడు నీటి కోసం బావులు, చెలమల వైపు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. అత్యవసర సమయంలో వైద్యం సేవలు కావాలంటే డోలిమోతలే శరణ్యమని స్థానికులు వాపోతున్నారు.

మైదాన ప్రాంత రహదారి పనుల్లో అంతే, బీఎన్ రోడ్డుకు ఇరుపక్కలా సెంటర్ నుంచి 40 గజాల దూరంలో విస్తరణ పనులు చేపట్టారు. కాలువల తవ్వి మెటల్ వేసి నెల దాటినా ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో వాహన చోదకులు నానా ఇక్కట్లు పడుతున్నారు. కొన్ని చోట్ల కాలువలు తవ్వి మెటలు వేయకుండా అలాగే వదిలేశారు. దీంతో పలువురు వాహన చోదకులు అదుపుతప్పి బోల్తా పడుతున్నారు. గిరిజన గ్రామాల వారు పాఠశాలలు ఏర్పాటు చేసి, రహదారులు మెరుగుపరచాలని, అంగన్‌వాడీ కేంద్రాలు, ఒక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ ఏర్పాటు చేసి ఇచ్చిన మాటకు కట్టుబడాలని కూటమి ప్రభుత్వాన్ని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మైదాన ప్రాంతంలోనూ బీఎన్ రోడ్డు పనులు సత్వరమే పూర్తి చేయాలని ఆయా గ్రామాల వారు కోరుతున్నారు.



బీఎన్ రోడ్డులో రోలుగుంటలో రోడ్డు పనుల కోసం గోతులు తీసి మెటలు వేయని ప్రాంతం

లోసింగిలో పాఠశాల ఏర్పాటు చేయాలి



అర్ల పంచాయతీ పెదగరువు, చినలోసింగి, పెదలోసింగి, పీత్రుగెడ్డ శివారు గ్రామాల్లో 30 మంది బడి ఈడు పిల్లలున్నారు. వారికి పాఠశాల ఏర్పాటు చేయాలి.

– ఎస్.కృష్ణ, విద్యార్థి తండ్రి, పెద గరువు గ్రామం, అర్ల పంచాయతీ, రోలుగుంట మండలం

ఆరోగ్య సబ్ సెంటర్ లేక ఇబ్బందులు



పీత్రుగెడ్డలో వైద్య సేవల కోసం ఆరోగ్య సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలి. అంతవరకు మాకు డోలిమోత కష్టాలు తప్పేలా లేవు.

– కె. కోయిల, పీత్రుగెడ్డ గ్రామం, అర్ల పంచాయతీ, రోలుగుంట మండలం

రోడ్డు పనులు పూర్తి కాలేదు



బీఎన్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. దీనిలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా గోతులు తవ్వారు. కొన్ని చోట్ల మెటల్ పని ఉన్నపళంగా వదిలేశారు. దీంతో వాహనచోదకులు రాత్రిళ్లు అదుపు తప్పి బోల్తాపడుతున్నారు. మెటల్‌తో పూర్తిస్థాయిలో గోతులు కప్పి రోడ్డు పనులు వేగవంతం చేయాలి.

– బి.రాజు, స్థానికుడు, రోలుగుంట గ్రామం, మండలం

బురదలో వాహనదారుల ఇక్కట్లు



బురదలో కూరుకుపోయిన వాహనాలతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం– నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో బంగారుమెట్ట పాఠశాల వద్ద బురదలో వాహనాలు కూరుకుపోయి పలువురు వాహనదారులు అవస్థలు పడ్డారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో గోతుల్లో నీరు చేరింది. ఇక్కడ రోడ్డు పక్కన టెలీఫోన్ మరమ్మతులకు గొయ్యి తవ్వారు. ఈ గోతులో మట్టి వేయడంతో రోడ్డంతా బురదమయంగా మారింది. దీంతో ఆదివారం సాయంత్రం నుంచి రాకపోకలు సాగించే ఆటోలు, ద్విచక్ర వాహనాలు, సైకిల్ ఇతర వాహనాలు బురదలో కూరుకుపోయాయి. చీకట్లో వాహనాలను బయటకు లాగి తీవ్ర అవస్థలు పడుతూ ప్రయాణికులు రాకపోకలు సాగించారు.

అంతర పంటగా నువ్వు



గొట్లాంలో అంతర పంటగా సాగవుతున్న నువ్వు

కె.కోటపాడు: అంతర పంటల సాగు విధానంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో మెట్ట ప్రాంత గ్రామాల రైతులు ప్రస్తుతం మామిడి మొక్కతోటల మధ్య ఖాళీ ప్రదేశాల్లో అంతర పంటలను సాగు చేస్తున్నారు. పాతవలస, చిరికివానిపాలెం, యద్లవానిపాలెం, కొరువాడ, కె.కె.అగ్రహారం, గొట్లాం, శృంగవరం గ్రామాల్లో మామిడిలో అంతర పంటగా నువ్వు సాగు చేస్తున్నారు. ఇలా సాగు చేయడం వల్ల రెండు విధాలా లాభదాయకంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

అంబేడ్కర్ ఆశయాలు ఆదర్శనీయం

ఘనంగా దీపోత్సవం



అంబేడ్కర్ విగ్రహం వద్ద దీపోత్సవంలో పాల్గొన్న గంగయ్య, తదితరులు

మాడుగుల రూరల్: రాజ్యాంగకర్త, డాక్టరు బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు అందరికీ ఆదర్శనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుట్టా గంగయ్య పేర్కొన్నారు. అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని బీజేపీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు మేరకు ఆదివారం రాత్రి మాడుగులలో ఆ పార్టీ ఆధ్వర్యంలో దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సేవలను కొనియాడారు. మాడుగుల బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద, నెయ్యిల వీధి, అంబేడ్కర్ కాలనీ వద్ద అంబేడ్కర్ విగ్రహాలు వద్ద బీజేపీ నాయకులు దీపాలు వెలిగించి, శ్రద్ధాంజలి ఘటించారు. జోహార్ అంబేడ్కర్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె. వెంకటేశ్వరావు, ఎస్. వెంకటరాజు, ఎం. ఛాయరామ్, పుట్టా నానాజీ, రెడ్డి కొండబాబు, లక్కిడప్ ప్రసాదు, నాయకులు దాసు, మరువాడ ఈశ్వరరావు, నాగేంద్ర, రాజు, మోహన్‌రావు పాల్గొన్నారు.

నావెల్ డాక్‌యార్డ్ సంక్షేమ సంఘం సమావేశం



మాట్లాడుతున్న పీఏ నాయుడు తదితరులు

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామంలో నేవల్ డాక్‌యార్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘ కార్యాలయంలో సంఘ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు ఎస్. దాసుబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలక్ష్మి జ్యూవెలర్స్ అధినేత పి.ఎ. నాయుడు, పి. అనిల్ కుమార్ పాల్గొన్నారు. సంఘ అభివృద్ధి గురించి ముఖ్య అతిథులు మాట్లాడారు. అనంతరం సంఘ సభ్యులకు వారి చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు రొంగలి కృష్ణారావు, సలహాదారులు సోర్లపూడి సత్యం, అధ్యక్షుడు మేడపాటి దాసుబాబు, ఉపాధ్యక్షుడు జి. అచ్యుతరావు, ప్రధాన కార్యదర్శి రావిపల్లి రవి, సలహా కార్యదర్శి కోల్లి ప్రసాద్, ఆర్. రమణ, కోశాధికారి గోర్లి దేముడు, సిరపరపు హరీష్‌తో పాటు, పాలకవర్గ సభ్యులు పైల శ్రీరాములు, ఎస్. ఎర్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

32 ఏళ్ల తర్వాత ఆత్మీయ కలయిక



వడ్డాది హైస్కూలులో పూర్వ విద్యార్థుల సందడి

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది కె.ఎ.డి. జెడ్పీ హైస్కూలులో పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. 2002–03 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన వీరంతా 32 సంవత్సరాలు తర్వాత కలుసుకుని మురిసిపోయారు.

ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్య, ఉద్యోగ, వ్యాపార నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా తాము చదువుకున్న హైస్కూలులో సమావేశమై ఒకరినొకరు పలకరించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. నాడు తమకు విద్య నేర్పిన గురువులను సత్కరించారు.

మాడుగుల: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. 1999–2000 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు 150 మంది ఒక చోటకు చేరారు. చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకున్నారు. 25 ఏళ్ల తర్వాత ఒకరికొకరు కలుసుకోవడంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఎవరెవరు ఏ రంగంలో స్థిరపడ్డారో చర్చించుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులకు దుశ్శాలువాలు కప్పి సత్కరించారు.



మాడుగులలో ఒక చోటకు చేరిన పూర్వ విద్యార్థులు

రామాలయానికి కొత్త కళ



రామాలయాన్ని శుభ్రం చేసి జెండాలు పాతిన యువకులు

బుచ్చెయ్యపేట: మండలంలో కేపీ అగ్రహారంలో శిథిలమైన రామాలయాన్ని గ్రామ యువకులు పరిశుభ్రం చేశారు. గ్రామ కొండపై పురాతన కాలం నాటి రామాలయం ఉంది. అక్కడకు భక్తులెవ్వరూ వెళ్లి పూజలు చేయకుండా వదిలేయడంతో తుప్పలు, డొంకలు పెరిగిపోయాయి. గ్రామ నూకాంబిక యువకులు ఆదివారం కొండపైన రామాలయం వద్ద వాటిని తొలగించి శుభ్రం చేసి రంగులు వేశారు. రామాలయం చుట్టూ జై శ్రీరామ్ జెండాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. గుడిని అందంగా తీర్చిదిద్దిన యువకులను గ్రామస్తులు అభినందించారు.

త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పట్టణ ఎస్‌ఐ సంతోష్, తదితరులు

అనకాపల్లి: త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్‌ను స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఎస్‌ఐ సంతోష్, తదితరులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి రచించిన ఈ జ్ఞాన తెలుగు కాల సూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికి సరళమైన భాషలో అర్థమయ్యేలా ఈ క్యాలెండర్ ఉందన్నారు. తెలుగు నెలలు అనుసరించేలా తెలుగు తిథులతో ఆంగ్ల తేదీలను పొందుపరిచి తయారు చేసిన ఈ క్యాలెండర్ ప్రతి ఇంట్లో ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విశాఖపట్నం కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు రమణ అక్షయ్, కుమార్, నాగమణి, పద్మ, సత్యవతి, కన్య, మీనాక్షి, దేవి, ఈ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతోనే పోటీ పరీక్షల్లో రాణింపు

మునగపాక: విద్యార్థులు సాంకేతిక రంగంలో రాణించాలని ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భీమిశెట్టి ఉమాశంకర్ కోరారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్, అనకాపల్లికి చెందిన షిర్డీ సాయి లా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలీసెట్ శిక్షణ తరగతులను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో రాణించాలంటే ఏకాగ్రత ఎంతో అవసరమన్నారు. సాంకేతిక రంగాల్లో రాణించేందుకు పాలీసెట్ దోహదపడుతుందన్నారు. ఇటువంటి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఏవీఎస్ మూర్తి, పెంటకోట సత్యనారాయణ మూర్తి, మాడెం జోగారావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ఉమాశంకర్‌ను ఘనంగా సత్కరించారు.

వైభవంగా వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ముత్యాలునాయుడు

దేవరాపల్లి: మండలంలో నాగయ్యపేట పంచాయతీ శివారు సీతమ్మపేట గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలునాయుడు దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సత్కరించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, వైస్ ఎంపీపీ ఉగ్రాకల గంగాభవానీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బూరె బాబూరావు, పెదనందిపల్లి ఎంపీటీసీ సభ్యురాలు రొంగలి నారాయణమ్మ, ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల వెంకటరమణ, నాయకులు వంటాకు శ్రీను, ఉగ్రాకల అప్పారావు పాల్గొన్నారు.

చేతికందే ఎత్తులో విద్యుత్ వైర్లు



అప్పలనాయుడు ఇంటి వద్ద వేలాడి ప్రమాదకరంగా ఉన్న వైరు



జానకీరాంపురంలో ఇళ్ల మధ్య ప్రమాదకరంగా స్తంభం నుంచి వేలాడుతున్న వైర్లు

నరిచేయకుంటే ఆందోళనకు దిగుతామని సర్పంచ్ హెచ్చరిక

రోలుగుంట: జానకీరాంపురంలో గృహాల వద్ద విద్యుత్ స్తంభం నుంచి చేతికందే ఎత్తులో వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఇవి తగిలి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు షాక్‌కు గురై స్పృహతప్పి పడిపోగా, సత్వర వైద్య సేవలతో కోలుకున్నారు. ఈ సమస్యను ఆ శాఖ డీఈకి విన్నవించి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ లగుడు కృష్ణంనాయుడు కోరారు. ఇక్కడ విద్యుత్ స్తంభం మార్చడానికి మూడు నెలల క్రితం షిఫ్టింగ్ చార్జీ రూ.27,481 చెల్లించారు. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన బాధిత గృహ యజమానులు ఆదపురెడ్డి అప్పలనాయుడు, లాలం సత్తిబాబు తదితరులు షిఫ్టింగ్ చార్జీ చెల్లించినా పట్టించుకోకపోవడంతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. దీనిపై ఏఈ రమేష్‌ని సంప్రదించగా కట్టిన అమౌంటుకు సంబంధించి డీఈ కార్యాలయం నుంచి తమ కార్యాలయానికి వర్క్ ఆర్డరు రావాల్సి ఉందని, వచ్చిన వెంటనే సమస్య పరిష్కరిస్తామన్నారు.

తెలుకుల కులస్తుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గండేపల్లి వెంకట్రావు

అనకాపల్లి: అఖిల గాండ్ల తెలుకుల కులస్తులు సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా అఖిలగాండ్ల తెలుకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గండేపల్లి వెంకట్రావు అన్నారు. స్థానిక బాలాజీరావు సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం వివిధ మండల అధ్యక్ష, కార్యదర్శుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా శాఖను బలోపేతం చేయడం కోసం జిల్లాలోని అన్ని మండలాల్లో తెలుకుల కులస్తులను సమీకరించి సమర్థులైన వారిని ఎంపిక చేసి జిల్లా శాఖలోకి తీసుకుంటామన్నారు. జిల్లాలో 20 వేల మంది తెలుకుల కులస్తులు ఉన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మంది ఉన్నట్లు చెప్పారు. బీసీ కులాల్లో అత్యంత వెనుకబాటుతనంతో మగ్గిపోతున్న ఈ కులస్తులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన కోరారు. జిల్లా స్థాయిలో తమ కులస్తులకు ఒక కల్యాణ మండపానికి అవసరమైన స్థలం, నిధులు కేటాయించాలని కోరారు.